www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 117 గురువారం, సెప్టెంబర్ 10, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad






2లో

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో
# కుట్ర..

బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం
అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ
కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్,

మిగతా2లో...



## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన

మిగతా2లో...

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన
15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన



2లో

### స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..
## నోటీసు ఎలా ఇస్తారు?

- గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



## గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

● పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు ● కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ ● 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ● రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం ● మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు: కేటీఆర్



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు

మిగతా2లో...



## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

- రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె

మిగతా2లో...

### శాసనసభ నుంచి బీఆర్ఎస్
## ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం

మిగతా2లో...

### యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ
# రద్దు చేయం

● ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్ ● రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు ● సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం.. ● శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం



2లో

### తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న
## ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 :** తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి“తెలంగాణ రైజింగ్ సమ్మిట్”లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్

మిగతా2లో...

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చుని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు.

# గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

(మొదటి పేజీ తరువాయి)

బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి.

పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**అమరావతి,సెప్టెంబర్ 9 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..నోటీసు ఎలా ఇస్తారు?

**హైదరాబాద్:సెప్టెంబర్ 9 :**
జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 :** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిం చారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్–కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ. 2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణకు సంబంధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇది ఘట్‌కేసర్–కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ. 2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం–రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

**హైదరాబాద్,సెప్టెంబర్ 9 :** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు



పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025–26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, e-POS సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# బీఆర్ఎస్‘బాకీ కార్డు’ల డ్రామాపై కాంగ్రెస్ విరుచుకుపాటు

**-- పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలేవని నిలదీసిన పులి శివకుమార్**



దళిత ముఖ్యమంత్రి ఏరి?: దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని

**బాలానగర్ సెప్టెంబర్ 10 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర శాసనసభ వేదికగా ప్రజల సమస్యలు చర్చించకుండా నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, అసూయ, ద్వేషం గుప్పించడమే పనిగా పెట్టుకున్న బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై బాలానగర్ కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులకు కనీస సహనం, ఓపిక లేకపోవడం శోచనీయమని బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నేతలు “బాకీ కార్డులు” పంచుతూ తిరగడంపై ఘాటుగా స్పందించారు. పదేళ్ల తమ హయాంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ బీఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు.

**-- హామీల అమలుపై నిలదీత:** దళిత ముఖ్యమంత్రి ఏరి?: దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి ఎన్నికల తర్వాత కేసీఆర్ పీఠమెక్కారని, అప్పుడు ఈ బాకీ కార్డు ఏమైందని నిలదీశారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా మూడు ఎకరాల భూమి ఏది?: ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోనప్పుడు బీఆర్ఎస్ నాయకుల బాకీ కార్డు ఎందుకు బయటకు రాలేదని ఎండగట్టారు. రేషన్ కార్డులు నిరాకరణ: పదేళ్ల సుదీర్ఘ పాలనలో ఒక్క కొత్త తెల్ల రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అప్పుడు ప్రజలకు బీఆర్ఎస్ బాకీ పడలేదా అని మండిపడ్డారు.

**ఆరోగ్యశ్రీ నిర్లక్ష్యం:** రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించక పేదలు ఆస్పత్రుల్లో అల్లాడిపోయినప్పుడు బీఆర్ఎస్ బాకీ కార్డు ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా విమర్శలు పక్కన పెట్టి, పదేళ్ల తమ అధికారంలో ఎన్ని హామీలు పూర్తయ్యాయో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషాన్ని చిమ్మడం మాని, తెలంగాణను దేశంలోనే అగ్ర స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వానికి సహకరించాలని బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ కోరారు.

# సర్పంచుల హక్కుల కోసం ఐక్య పోరాటం

**బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ములుగు జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ ముష్నేపల్లి కుమార్ గౌడ్**




**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09( పీపుల్స్ న్యూస్)**
జిల్లాలోని 9 మండలాలకు చెందిన సుమారు 130 మంది సర్పంచులు ఏకతాటిపైకి వచ్చి కలెక్టర్‌లి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సర్పంచుల ప్రధాన డిమాండ్‌గా ఉపసర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేసి, గ్రామ పంచాయతీల పరిపాలనలో సర్పంచుల అధికారాలను బలోపేతం చేయాలని కోరుతూ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలంటే సర్పంచులకు పూర్తి బాధ్యతతో పాటు తగిన అధికారాలు ఉండాలని సర్పంచుల ఫోరం స్పష్టం చేసింది. అలాగే, ఈ సమస్యను త్వరలో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి, సర్పంచుల సమస్యలపై వినతిపత్రం సమర్పించి, పరిష్కారం కోసం ప్రభుత్వంపై తమ డిమాండ్లను తెలియజేస్తామనిముష్నేపల్లి కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచుల ఐక్యత హక్కుల సాధన కోసం నిరంతర పోరాటంఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు లాద శ్యామ్ రావు ఉపాధ్యక్షులు రమణారెడ్డి ప్రధాన కార్యదర్శి రాజు నాయక్, తాడ్వాయి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు గడ్డం నాగభూషణం ఉపాధ్యక్షులు దిద్ది మోహన్ రావు ప్రధాన కార్యదర్శి పీరీల భారతి ఎటునాగారం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు గద్దల నవీన్ కన్నాయిగూడెం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు పీరీల స్వప్న ఉపాధ్యక్షులు తిప్పనపల్లి లక్ష్మయ్య తదితర మండలాల అధ్యక్షులు గ్రామ సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మట్టి గణపతులే మన పర్యావరణానికి రక్షణ కవచం!

**-- 5 వేల మట్టి వినాయకుల ఉచిత పంపిణీకి శ్రీకారం.. చందానగర్, దీప్తి శ్రీనగర్ డివిజన్లలో బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ వినూత్న కార్యక్రమం**



**శేర్లింగంపల్లి : సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. చందానగర్, దీప్తి శ్రీనగర్ డివిజన్లలో శనివారం నుంచి మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి తెలిపారు. మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. భక్తితో పాటు బాధ్యత కూడా ఉండాలి వినాయకుడిపై భక్తిని చాటుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలని నవత రెడ్డి సూచించారు. మట్టి వినాయకులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, సలీం, చందర్ రావు, గౌస్, అంజి యాదవ్, అనంత రెడ్డి పాల్గొన్నారు.

# ములుజిల్లా మాల పోరాట సమితి అధ్యక్షులుగా ముద్దమల్ల కరుణాకర్





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09(పీపుల్స్ న్యూస్)**
మాలల ఉప కులాల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని మాల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నగంటి మధుకర్ అన్నారు ఈ సందర్భంగా ములుగుజిల్లా మాల పోరాట సమితి అధ్యక్షునిగా కరుణాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అనంతరం ఎన్నికైన పత్రాన్ని ముద్రమల్ల కరుణాకర్ కు అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొనగంటి మధు . భూపాలపల్లి మాల పోరాట సమితి అధ్యక్షులు పసుల రాకేష్ పాల్గొన్నారు నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు తుప్పరి రంజిత్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మాలల హక్కులకై పోరాడేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లాలో మండల గ్రామ అన్ని కమిటీలు వేసి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మాల హక్కులకై పోరాడేందుకు కృషి చేస్తాననీ కరుణాకర్ తెలియజేశారు

# గౌడులు అన్ని రంగాల్లో అభివృద్ధికి గౌడ ఉద్యోగులు కృషి చేయాలి

**- కే.యూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్**
**- కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గౌడ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం**




**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09( పీపుల్స్ న్యూస్)**
గౌడ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని కాక తీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు ఉమ్మడి జిల్లాగోపా అధ్యక్షులు చిర్ర రాజు గౌడ్ అన్నారు జిల్లా కేంద్రంలోని గొల్ల పల్లి రాజేందర్ గౌడ్ పామ్ హౌస్ లో గౌడ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కేజీ కేస్ ములుగు జిల్లా గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ గౌడ ఉద్యోగస్తులు గౌడులు విద్య, సామాజిక, ఆర్థిక,రాజకీయ రంగాల్లో ఎదుగుదల కోసం అభివృద్ధి కోసం గౌడ ఉద్యోగులు కృషి చేయాలని వారు కోరుతూ కల్లు గీత కార్మిక సంఘం గౌడ ఉద్యోగులను ఐక్యం చేయడం అభినందనీయమని అన్నారు. కల్లు గీత కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నది ఒక్క కల్లు గీత కార్మిక సంఘం మాత్రమేనని ఆయన అన్నారు. కల్లు గీత కార్మిక సంఘం చేసే పోరాటాలకు మా పూర్తి మద్దతు ఉంటుందని చిర్ర రాజు గౌడ్ అన్నారు. కార్యక్రమం అనంతరంకల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గౌడ ఉద్యోగుల ను ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ గోడ ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మేడి చైతన్య గౌడ్ పొన్నం.మానస గౌడ్.బుర్ర రజిత గౌడ్.డెంటల్ డాక్టర్ బొమ్మగాని అఖిల్ గౌడ్. సర్పంచ్ల ఫోరం జిల్లా కన్వీనర్ ముసిన పెల్లి కుమార్ గౌడ్ కే జి కే ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు పులి నరసయ్య గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు గాజుల ఈశ్వర్ గౌడ్ నక్క యాకయ్య గౌడ్ పులి రమేష్ గౌర్రంగు సత్యనారాయణ గౌడ్ కునూర్ సాగర్ గౌడ్ గౌని సతీష్ గౌడ్ గొట్టి పర్తి నవీన్ గౌడ్ రావుల రాకేష్ గౌడ్ సురేష్ గౌడ్ ఐలి దామోదర్ గౌడ్. కోనూరు చిన్న రాయుడు గౌడ్ మూల వెంకన్న గౌడ్. కక్కెర్ల సాంబయ్య గౌడ్ ముని గాల సురేష్ గౌడ్ ఓ ల్లాల రాజేందర్ గౌడ్తో పాటు 35 మంది పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలి

**-- ఫతేనగర్‌లో తాత మధు దిష్టిబొమ్మ దగ్ధం.. కాంగ్రెస్ నాయకుల తీవ్ర నిరసన**



**బాలానగర్ సెప్టెంబర్ 10 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఫతేనగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తాత మధును తక్షణమే సస్పెండ్ చేసి, ఆయనపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పిలుపు మేరకు, ఫతేనగర్ డివిజన్ ఉపాధ్యక్షులు ఎల్. నర్సింగ్ రావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీటకోరు కృష్ణ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ బ్రిడ్జి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొండాకింద పుష్పారెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎం. రాము, మాజీ డివిజన్ అధ్యక్షులు కే. రమేష్, డివిజన్ అధ్యక్షులు కే. క్రాంతి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా డీసీసీ కార్యదర్శులు కే. వినయ్, ఎండీ. హమీద్, మహిళా కాంగ్రెస్ ఫతేనగర్ డివిజన్ అధ్యక్షురాలు గుండా జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అరుణ్ జంగీర్, ఎండీ. జంగీర్, జీ. కిరణ్ అన్వార్, యువజన కాంగ్రెస్ నాయకులు మౌనేధర్ గౌడ్, ఎండీ. అసిఫ్ బాబా, మహిళా నాయకులు సరిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి.

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్.**






**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09( పీపుల్స్ న్యూస్)**
ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరం నుండిజిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించి, జిల్లాలలో పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాలలో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇందు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి, కేంద్రీకృత సేకరణ లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మ నాయక్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఐ ఓ వీరేందర్, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా కవి కాళోజీకి డీజీపీ కార్యాలయంలో ఘన నివాళి

**- ప్రజా సమస్యలపై కలంతో పోరాడిన కాళోజీ సేవలు చిరస్మరణీయం.. జయంతి సందర్భంగా స్మరణ**



**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ ప్రజల గుండె చప్పుడును తన రచనల ద్వారా ప్రపంచానికి వినిపించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను డీజీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు.
ప్రజా సమస్యలను తన సాహిత్యంలో ప్రతిబింబిస్తూ, సామాజిక చైతన్యానికి కాళోజీ చేసిన కృషిని అధికారులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, తెలంగాణ భావజాలాన్ని తన రచనల ద్వారా బలంగా వినిపించిన కాళోజీ సాహిత్య సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ గజరావు భూపాల్, మల్టీజోన్--×× ఐజీ షానవాజ్ ఖాసిం, ఏఐజీ అడ్మిన్ జె. అన్యోన్య, టీజీ స్పార్క్ ఎస్పీ రూపేష్, పేషీ డీఎస్పీ భాస్కర్, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఎస్ఓ యోగేశ్వరరావుతో పాటు ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

**- కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు**



**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**
ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు ప్రజా సమస్యలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యం కల్పించిన తీరును స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, ప్రజా హక్కుల కోసం కాళోజీ చేసిన సాహిత్య పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
కాళోజీ ఆశయాలను స్మరించుకుంటూ ప్రజా సంక్షేమం, సామాజిక బాధ్యత పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు సాగాలని ఏసీపీ శంకర్ రాజు సూచించారు.

# అసెంబ్లీ ప్రజా సమస్యల కోసమా.. కొట్లాటల కోసమా?

**- విద్య, వైద్యం, ఉద్యోగాలపై చర్చ ఏదీ?.. అధికార, విపక్షాల తీరుపై యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ ఆగ్రహం**



**మేడ్చల్--మల్కాజిగిరి: సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యలపై చర్చించేందుకా.. లేక అధికార, విపక్షాలు పరస్పరం విమర్శించుకునేందుకా అని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాల్లో విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కీలక సమస్యలపై పూర్తిస్థాయి చర్చ జరగడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి పరస్పర ఆరోపణలతో అసెంబ్లీ విలువైన సమయాన్ని వృథా చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ ప్రజల గొంతుకగా నిలవాలి.. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చలు జరిపి పరిష్కారాలు చూపాలని ప్రభుత్వాన్ని చంద్రకాంత్ డిమాండ్ చేశారు

# ఆన్ లైన్ లో గణేష్ మండపాల నమోదు తప్పనిసరి

**వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు**



**(వెంకటాపూర్)ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు వెంకటాపూర్ మండలం ముస్తాబవుతోంది. ఇప్పుడిప్పుడే గణనాథుల విగ్రహాలు గ్రామాలకు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకటాపూర్ మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల నిర్వాహకులు సైతం తప్పనిసరిగా ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
వెంకటాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. మండపాల వివరాలు ముందుగా తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ, తగిన భద్రతా ఏర్పాట్లు చేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. కావున మండలంలోని గణేష్ మండప నిర్వాహకులు జూశీశ్రీఱవెజూశీటిఖ్రీ.ంజూశీశ్రీఱషెవ.ౌత్రశీజ.ఱఅ/ఱఅఎవఞ.ష్ట్రవ లో రిజిస్ట్రేషన్ చేసి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు నంబర్..8712670083 సంప్రదించాలన్నారు.

# సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి.**





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09( పీపుల్స్ న్యూస్)**
సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావా లని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు - పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ తాజా వివరాలు రాజకీయ పార్టీలకు వెల్లడించాలి.

**- పోలింగ్ కేంద్రాల వారీగా దావాలు, అభ్యంతరాల జాబితాల అందజేత.**
**- జిల్లా ఎన్నికల అధికారి,**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026కు సంబంధించిన తాజా వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని మినీ సమావేశ మందిరంలో 109--ములుగు ఎస్టీ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చేపడుతున్న ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్‌ను అక్టోబర్ 19 నుంచి నవంబర్ 9 వరకు పొడిగించిన నేపథ్యంలో, సవరించిన షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు అందిన దావాలు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారాలు--9, 10, 11 జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందిన దావాలు, అభ్యంతరాలు, ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వాటి ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరాలను సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల



ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

**- ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి కుత్బుల్లాపూర్ ఏసిపి బాల గంగి రెడ్డి హెచ్చరిక**






**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు చట్టాన్ని గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే గౌరవప్రదమైన వృత్తులను ఎంచుకుని స్వయం సమృద్ధి సాధించాలని కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసిపి బాల గంగి రెడ్డి సూచించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులతో ఏసిపి బాల గంగి రెడ్డి సమావేశమై వారి సమస్యలు, పరిస్థితులపై వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా గృహప్రవేశాలు, షాపుల ప్రారంభోత్సవాలు, పండుగలు, ఇతర మతపరమైన కార్యక్రమాల సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏసిపి హెచ్చరించారు. భిక్షాటనతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సమావేశంలో అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీస్ విభాగంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఇటీవల లభిస్తున్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని, స్వయం ఉపాధి లేదా ఉద్యోగాలను ఎంచుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఏసిపి సూచించారు. సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జీడిమెట్ల సీఐ కె. రవి కుమార్, సెక్టార్ ంఱం ప్రేమ్ సాగర్, శ్రీనివాస్, శ్యామ్ బాబు, రామచంద్రయ్యతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లంచాలిస్తే ఆకాశానికి అందే అంతస్థులు..

# ఇవ్వకుంటే భవనాల కూల్చివేతలా?

●గాజులరామారం సర్కిల్-57లో

టౌన్‌ప్లానింగ్ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు..

అధికారుల తీరుపై స్థానికుల అనుమానాలు



సూరారం శ్రీకృష్ణ నగర్ వద్ద అక్రమ నిర్మాణం.








మల్లారెడ్డి నగర్ ఫేస్ 2 ప్రాంతంలో అనుమతి మించి అక్రమ నిర్మాణం.

**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు కొందరి విషయంలో ఒకలా.. మరికొందరి విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు గాజుల రామారం సర్కిల్-57 పరిధిలో వినిపిస్తున్నాయి. నిర్మాణ నిబంధనలు ఉల్లంఘిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



సీతారామ దేవాలయం ట్రైన్స్ ఆపోజిట్ అక్రమ సెల్లార్ కమర్షియల్ భవనం నిర్మాణం.



### లంచాలిస్తే అంతస్థులు పెరుగుతాయా?

అనుమతులకు మించి నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోకుండా వదిలేస్తున్నారని, మరోవైపు అధికారుల డిమాండ్లకు తలొగ్గని నిర్మాణదారులపై మాత్రం నోటీసులు, కూల్చివేత చర్యలు వేగంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో “అందరికీ ఒకే నిబంధనలా? లేక ముడుపుల ఆధారంగా చర్యలా?” అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.

### సీఎంసీ ఆదేశాలు కాగితాలకే పరిమితమా?

అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, నిబంధనల అమలులో పారదర్శకత ఉండాల్సి ఉన్నప్పటికీ.. గాజులరామారం సర్కిల్-57లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో వాటి అమలు ఏ మేరకు జరుగుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### లక్షల్లో జీతాలు.. ముడుపుల ఆరోపణలు ఎందుకు?

ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సి ఉండగా, కొందరు టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై ముడుపుల వసూళ్ల ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

గాజులరామారం సర్కిల్-57 పరిధిలో అనుమతులు లేకుండా, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణ అనుమతులు, ప్లాన్ ఉల్లంఘనలు, నోటీసులు, కూల్చివేత చర్యల వివరాలను బహిరంగపరచడంతో పాటు.. అధికారులపై వచ్చిన ముడుపుల ఆరోపణలపై కూడా ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### “ఎవరికి ఎంత ముడుపులు?” అన్న ఆరోపణల్లో నిజమెంత?

ఇక ఈ ఆరోపణలపై సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు.. ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఖండిస్తూ స్పష్టమైన వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

# రూ.20 వేల లంచం తీసుకుంటూ డీఐఈఓ అరెస్ట్.

**సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రామావత్ గోవింద్ రామ్‌పై ఏసీబీ ట్రాప్**

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**



రూ.20 వేల లంచం తీసుకుంటూ సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఐ×జూ) రామావత్ గోవింద్ రామ్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అధికారిక పని చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.వికాస్ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రొవిజనల్ అఫిలియేషన్ పొడిగింపు, రెన్యూవల్‌కు సంబంధించి తనిఖీ నిర్వహించి నివేదిక సమర్పించేందుకు అధికారి తొలుత రూ.50 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే రూ.30 వేలు తీసుకున్న అనంతరం మరో రూ.20 వేలు తీసుకుంటుండగా బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.అధికారి వద్ద నుంచి రూ.20 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కేసు దర్యాప్తులో ఉండగా, నిందితుడిని హైదరాబాద్‌లోని ఎస్పీఈ--ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపింది.ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# గుండెపోటుతో గొట్టె రవి మృతి

**మృతదేహాన్ని తరలించేందుకు ఆర్థిక సాయం అందించిన**

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**ఏటూరునాగారం హనుమకొండ**

**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్)**



గొట్టె రవి హనుమకొండలోని ఎంజిమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో (హార్ట్ ఎటాక్) మరణించారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన ఏటూరునాగారానికి తరలించడానికి అంబులెన్స్ ఖర్చుల నిమిత్తం నిరుపేద కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తెలుసుకున్నారు వెంటనే స్పందించిన లక్ష్మణ్ బాబు మృతదేహాన్ని ఏటూరునాగారానికి సురక్షితంగా తరలించేందుకు స్వయంగా అంబులెన్స్‌ను సమకూర్చడము జరిగిందిబి

# షాద్‌నగర్‌లో ఘనంగా ఎస్జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు..!

**350 మంది విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శన..విజేతలకు అభినందనలు**

**ఎంఈఓ మనోహర్ నేతృత్వంలో ఉత్సాహంగా కార్యక్రమం..!**





**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సెప్టెంబర్ 9**
ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం షాద్ నగర్ మినీ స్టేడియంలో నిర్వహించారు.ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ పోటీల్లో యు/14 బాలబాలికలు,యు/17 బాలబాలికలు విభాగాల్లో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలను మండల విద్యాశాఖ అధికారి టి. మనోహర్ పర్యవేక్షణలో నిర్వహించారు.వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఎస్జిఎఫ్ కార్యదర్శి,జోనల్ కార్యదర్శి, పీడీలులు,పిఈటీలు తదితరులు పాల్గొన్నారు.క్రీడా పోటీలను విజయవం తంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు,క్రీడా సిబ్బంది సహకరించారు.విజేత పాఠశాలలు యు/17 విభాగంలో ప్రథమ బహుమతి,జడ్.పి.హెచ్.ఎస్ చించోడ్ద్వితీయ బహుమతి సత్యసాయి స్కూల్ యు/14 విభాగంలో,ప్రథమ బహుమతి,ఇండియన్ హైట్స్ స్కూల్ద్వితీయ బహుమతి జడ్.పి.హెచ్.ఎస్ (బాలుర)షాద్‌నగర్, విజేతలను అధికారులు,ఉపాధ్యాయులు అభినందించారు.క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ హెచ్ఎం పద్మనాలిని,ప్రభుత్వ పాఠశాల ఫరుక్ నగర్ హెచ్ఎం వి.రాజశేఖర్ రెడ్డి,ఎస్జిఎఫ్ సెక్రెటరీ ఎ.రాజశేఖర్ రెడ్డి, జోనల్ సెక్రెటరీ బాలయ్య,సల్మాన్ రాజ్ పిడి,ఈ.లక్ష్మయ్య పిడి,రవీందర్ గౌడ్ పిడి, చంద్రశేఖర్ పిడి,సుజాత పిడి, సంగీత పిఈటి,నర్మదా పీడీ,పి.సునీల్ పిఈటి,రవి పిఈటి,కృష్ణ పిఈటి,వెంకటేష్ పిఈటి పాల్గొన్నారు.

# యాదగిరి నరసన్న భక్తులకు నీడనిచ్చేలా రూ.1.50 కోట్లతో కానోపి నిర్మాణం.

కొండ దిగువ నుంచి కొండపై వరకు మెట్ల మార్గంలో పైకప్పు నిర్మాణానికి శంకుస్థాపన.



**యాదగిరిగుట్ట, : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కొండ దిగువ నుంచి కొండపై వరకు మెట్ల మార్గంలో పైకప్పు (టెన్సిల్ కానోపి) ఏర్పాటు చేయనున్నారు. ఎం.ఎస్. అగర్వాల్ ఫౌండ్రీస్ తరపున దాత శ్రీమాన్ ప్రమోద్ అగర్వాల్ సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా బుధవారం శ్రీ స్వామివారి మెట్ల మార్గంలో కానోపి నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెట్ల మార్గంలో భక్తులు ఎండ, వర్షం నుంచి రక్షణ పొందేలా ఈ కానోపిని ఏర్పాటు చేయనున్నారు. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యం కలగనుంది.ఈ కార్యక్రమంలో ఎం.ఎస్. అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ ప్రెసిడెంట్ సుజయ్, ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొడకండ్ల మాధవాచార్యులు భార్గవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ కరోలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీఐ సమాచార హక్కు ప్రచార్ సమితి ప్రతినిధులు



**దేవరకొండ సెప్టెంబర్ 09**
దేవరకొండకు నూతనంగా విచ్చేసిన సబ్ కలెక్టర్ కరోలిన్ గారిని ఆర్టీఐ ప్రచార్ సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్టీఐ సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజు నాయక్ మాట్లాడుతూ, దేవరకొండ ప్రాంతంలో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించేందుకు సమాచార హక్కు ప్రచార్ సమితి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.నూతన సబ్ కలెక్టర్ కరోలిన్ ఆధ్వర్యంలో దేవరకొండ డివిజన్ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందాలని సమితి నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్ నాయక్, సీనియర్ సలహాదారుడు లక్ష్మీనారాయణ, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నారమోని హరీష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

**గణేష్ మండపాలు,శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదు**

**చిన్న స్పీకర్లకు మాత్రమే అనుమతి.. రాత్రి 10 గంటల వరకు వినియోగించాలి: ఎస్సై రమేష్**



**ఎల్లారెడ్డిపేట,రాజన్న సిరిసిల్ల జిల్లా సెప్టెంబర్ 9:** నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ హెచ్చరించారు.గణేష్ ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించి, నిబంధనలను వివరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద,శోభాయాత్రల్లో డీజేలు,యాంప్లిఫైయర్లతో బాక్సులు ఏర్పాటు చేసి అధిక శబ్దాలు చేస్తే డీజే యజమానులతో పాటు నిర్వాహకులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గణేష్ మండపాల వద్ద పోలీస్ అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని,వాటిని రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు.అధిక శబ్దాల వల్ల చిన్నారులు,విద్యార్థుల చదువుకు, వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్ల

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు

**- శాంతియుత వాతావరణం, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం: మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి**






**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)** నుంచి 25 వరకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలు--2026ను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. సుమతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి ఉత్సవాల బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు.ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణం, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. గణేష్ మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.విద్యుత్ అలంకరణలు, వైరింగ్, సౌండ్ సిస్టమ్‌ల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ఉత్సవాల సమయంలో మద్యం, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా కఠిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో పోలీస్ శాఖతో పాటు సంబంధిత శాఖలు జారీ చేసే మార్గదర్శకాలను నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా పాటించాలని కోరారు."మన జాగ్రత్త -- మన బాధ్యత -- మన భద్రత" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా, సామరస్యపూర్వకంగా విజయవంతం చేయాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ఎల్లంపల్లి నిర్వాసితులకు అండగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

- ●పెండింగ్ పరిహారంపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కీలక హామీ
- ●అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తా.. బాధితులకు న్యాయం చేస్తా



**అంతర్గాం, సెప్టెంబర్ 09 (పీపుల్స్ న్యూస్):**
ఎల్లంపల్లి డ్యాం నిర్మాణం కోసం భూములు కోల్పోయి ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్న భూ నిర్వాసితులకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ భరోసా కల్పించారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎదులపురం వెంకటేష్ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా అంతర్గాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎల్లంపల్లి డ్యాం భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు.
ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపులుడ్యాం నిర్మాణ సమయంలో తమ విలువైన భూములను కోల్పోయినప్పటికీ కొంతమంది నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని వెంకటేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో బాధిత కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. పెండింగ్ పరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషినిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సానుకూలంగా విన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్లంపల్లి డ్యాం బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ స్థాయిలో సమస్యను ప్రస్తావించి, పెండింగ్ పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే హామీతో బాధితుల్లో ఆశలుఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురుచూస్తున్న తమ సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం నిర్వాసితుల్లో వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో బాధిత కుటుంబాల్లో కొంత ఊరట నెలకొంది.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**- ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాదాపూర్ పోలీసుల సమావేశం**






**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని మాదాపూర్ పోలీసులు గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు.ఈ మేరకు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ వేడుకలను నిర్వహించాలని అధికారులు సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవ కార్యక్రమాలు, ఊరేగింపులు తదితర అంశాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సామరస్యపూర్వకంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ సమావేశంలో మాదాపూర్ డివిజన్ ఏసీపీ శ్రీధర్, మాదాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పద్మవిభూషణ్ శ్రీ కాలోజీ నారాయణరావు జయంతి



**మందమర్రి సెప్టెంబర్ 09**
మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం రోజునా ప్రజాకవి, పద్మవిభూషణ్ శ్రీ కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, కాలోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతు కాలోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు.?కాలోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.?" పుట్టుక నీది, చావు నీది... బతుకంతా దేశానిది" అని చాటిచెప్పిన కాలోజీ సిద్ధాంతాలు, ఆయన పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్. ప్రసాద్,ఏఐటీయూసీ, జి ఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సివి రమణ, సీఎం ఓ ఏ ఐ జాయింట్ సెక్రటరీ, రవి, ఏరియా ఈ అండ్ ఎం ఏ జి ఎం. బాలాజీ భగవతిజ, కేకే ఏజెంట్, ఖదిర్,శాంతి ఖని, ఏజెంట్, సంతోష్ కుమార్, కేకే ఓ సి పి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డి జి యం (పర్సనల్) సిహెచ్.

# నిమజ్జన ప్రదేశాల్లో పనులు వేగవంతం చేయాలి

- ●పెండింగ్ టెండర్లను వెంటనే పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలి
- ●30 శాతం పనులు కూడా పూర్తికాలేదు.. అధికారుల తీరుపై ఆకుల సతీష్ అసంతృప్తి





**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి నిమజ్జనానికి సమయం సమీపిస్తున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని ప్రధాన నిమజ్జన ప్రదేశాల్లో మౌలిక వసతుల పనులను అధికారులు వేగవంతం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి--కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ కోరారు. నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లను నిమజ్జనానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి నిమజ్జన ప్రదేశాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొంటూ, పండుగ ప్రారంభానికి ముందే అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఖరారు కాని టెండర్ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేసి పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు.

**పలు చెరువుల వద్ద ఏర్పాట్ల పరిశీలన.**
వెన్నెలగడ్డ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌తో కలిసి ఆకుల సతీష్ పరిశీలించారు. కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఊరకుంట, ధోమర్ కుంట చెరువుల వద్ద పనులు నెమ్మదిగా కొనసాగుతున్నట్లు గుర్తించి వేగం పెంచాలని సూచించారు. సూరారం చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు నిమజ్జనానికి వచ్చే భక్తులు, వాహనదారుల కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించే అంశంపై వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. దుండిగల్ పెద్ద చెరువు వద్ద బారికేడ్లు, రహదారి వెడల్పు అంశాలను పరిశీలించారు. బరంపేట పెద్ద చెరువు వద్ద నీటి కొరత నేపథ్యంలో నిమజ్జనానికి తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. బాచుపల్లి పెద్ద చెరువు వద్ద పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే వేగవంతం చేయాలని కోరారు. శ్రీరాముల కుంట వద్ద వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బేబీ పాండ్‌లో నిమజ్జనం నిర్వహించేందుకు చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పాపయ్య కుంట వద్ద గత వారం డిప్యూటీ కమిషనర్‌తో కలిసి పరిశీలన జరిపిన విషయాన్ని గుర్తుచేస్తూ, మంచినీటి చెరువులో నిమజ్జనం నిర్వహించకుండా బేబీ పాండ్ ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని, మరో ఐదు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని ఆకుల సతీష్ తెలిపారు.

**30 శాతం పనులు కూడా పూర్తికాలేదు.**
కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు మున్సిపల్ సర్కిళ్లలో నిమజ్జన మార్గాల్లో రోడ్లపై గుంతలు పూడ్చడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, నిమజ్జన మార్గంలో అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడం వంటి పనులు ఇంకా 30 శాతం కూడా పూర్తికాలేదని ఆకుల సతీష్ అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్ పనులన్నింటినీ అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. పనుల పురోగతిపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి మరో రెండు రోజుల్లో జోనల్ కమిషనర్‌ను కలిసి అందజేస్తామని తెలిపారు.

**అధికారులతో సమన్వయానికి ఉత్సవ సమితి సిద్ధం.**
వినాయక మండపాల నిర్వాహకులకు పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల నుంచి ఎదురయ్యే సమస్యలను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తామని ఆకుల సతీష్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజిరెడ్డి, కోకన్వీనర్ జై శంకర్ గౌడ్, డివిజన్ కన్వీనర్లు శంకర్ గౌడ్, పెద్ద బత్తుల సతీష్ సాగర్, మాధవులు, నాగరాజు, పీసరి కృష్ణారెడ్డి, పొలబోయిన శ్రీనివాసులు, కోకన్వీనర్లు ఎల్ల స్వామి, శ్రీనివాస్ యాదవ్, కేసారం రాజు, మాధవరావు, అల్లాడి మహేష్, అశ్విన్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కంది శ్రీరాములు, శ్యాం కుమార్ రెడ్డి, శరత్ గౌడ్, నాగరాజు, మనీ తదితరులు పాల్గొన్నారు.

## నేరడుగొమ్ము మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్



**దేవరకొండ 09సెప్టెంబర్ ) :**
నేరడుగొమ్ము మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో మండల పరిధిలోని ఉన్న అన్ని స్కూళ్ల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎంపిక ప్రక్రియలో క్రీడా ప్రతిభ, శారీరక సామర్థ్యం, ఇతర నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయి ఆటలలో పాల్గొంటారు. ఈ సెలక్షన్స్ ని ప్రారంభించడానికి మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మచారి, ఎస్సై నాగేంద్రబాబు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎన్.గణేష్, పీడీలు వెంకటేశ్వర్లు, కేతావత్ శ్రీను, చంద్రకళ, వెంకటేష్, ఉపాధ్యాయులు ఆంజనేయులు, యుగేందర్ రెడ్డి, శంకర్ గౌడ్, సుధాకారాచారి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంజీవ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై మధిర టౌన్ స్టేషన్లో బిఆర్ఎస్ ఫిర్యాదు




**మధిర సెప్టెంబర్ 9**
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర రావు మరణాన్ని బహిరంగంగా కోరుతూ హాని చేయటానికి ప్రేరేపించేలా వ్యాఖ్యల చేసిన ఎమ్మెల్యే శంకర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మధిర బిఆర్ఎస్ నాయకులు పల్లపోతు వెంకటేశ్వరావు, చిత్తారి నాగేశ్వరావు, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, చావా వేణు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, ప్యారి, చీధిరాల రాంబాబు, వేల్పుల శివ, వీర రాఘవరెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, తదితరులు మధిర టౌన్ సిఐ రమేష్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి బహిరంగంగా చావుని కోరిన ఎమ్మెల్యే శంకర్ పై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

- కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మల్కాజిగిరి కమిషనర్ బి. సుమతి నివాళి





**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ బి. సుమతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి. సుమతి మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక చైతన్యం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో ప్రజా సంక్షేమం, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజి నారాయణరావు ఆశయాలను కొనసాగించాలి

--- ఐక్య విద్యార్థి సంఘాలు



**మంచిర్యాల సెప్టెంబర్ 09**
ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని...మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహం లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రజా కవి కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, అన్యాయాలను ఎత్తిచూపారని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల్లో చైతన్యం కలిగించిన ఆయన సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువత సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం తో పాటు ప్రజా చైతన్య దినోత్సవంగా నిర్వహించాలని, ఆయన సాహిత్యాన్ని విద్యార్థులకు మరింత చేరువ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పూరెళ్ల నీతిష్, బచ్చలి అభిరామ్, గార కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**దేవరకొండ 09సెప్టెంబర్**
మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్, దేవరకొండలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాషా యాస, సంస్కృతి, సాహిత్యానికి విశిష్ట గుర్తింపు తీసుకొచ్చిన ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, "తెలంగాణ భాష అనేది కేవలం మాట్లాడుకునే యాస మాత్రమే కాదు.. అది తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీక" అని అన్నారు. తెలంగాణ భాషలోని మాధుర్యం, సహజత్వం, జీవనానుభవం తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేశాయని పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచారని, తన రచనల ద్వారా సామాన్యుల కష్టాలను, ప్రజల ఆకాంక్షలను, సామాజిక సమస్యలను నిర్భయంగా వ్యక్తీకరించారని ప్రిన్సిపాల్ అన్నారు. "కాళోజి సాహిత్యం మనకు భాషను ప్రేమించడం మాత్రమే కాకుండా, సమాజాన్ని అర్థం చేసుకోవడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, మానవీయ విలువలను కాపాడుకోవడం నేర్పుతుంది" అని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో తెలంగాణ భాష, యాస, జానపద సంస్కృతి కొత్త తరాలకు చేరేలా విద్యార్థులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాతృభాష పట్ల గౌరవం కలిగి ఉండటంతో పాటు, తెలంగాణ భాషలోని ప్రత్యేకమైన పదజాలాన్ని, సామెతలను, నుడికారాలను, జానపద సాహిత్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భాషాభిమానం, సాహిత్యాసక్తి, ప్రాంతీయ సంస్కృతిపై అవగాహన పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఒ తెలుగు విభాగాధిపతి జి కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి లింగమయ్య కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి లింగారెడ్డి, అద్దంకి శ్రీను విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అడసర్ల పాడులో కొత్త రేషన్ కార్డులు పంపిణీ



**ఖమ్మం సెప్టెంబర్ 8**
వేంసూర్ మండల పరిధిలోని అడసర్లపాడు గ్రామంలో బుధవారం జి పి ఓ అనూష ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కాస్ర చంద్రశేఖర్ రెడ్డి సర్పంచ్ కాటేజమలారావు చేతులు మీదుగా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అట్లూరి సత్యనారాయణరెడ్డి గ్రామ పంచాయతీ సెక్రటరీ ఉపేంద్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు

గురువారం, సెప్టెంబర్ 10, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# రాజీ మార్గమే రాజమార్గం

●జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

●మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**మెదక్ సెప్టెంబర్ 09**
చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక వివాదాలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.వివాదాలను కక్షలుగా మార్చుకుని ఇరువర్గాలు సమయం, ధనం కోల్పోవద్దని ఎస్పీ సూచించారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని గుర్తించి లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలకు అవగాహన, కౌన్సెలింగ్ కల్పిస్తూ పరిష్కారానికి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కృషి చేస్తారని తెలిపారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# కవితపై అనుచిత కామెంట్స్

- కానిస్టేబుల్‌పై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు


FIRST INFORMATION REPORT



**హైదరాబాద్ 9 సెప్టెంబర్**
మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై, ప్రత్యేకించి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.మాజీ ఎంపీ, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరమైన, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఓ పోలీసు కానిస్టేబుల్‌పై పోలీస్ శాఖ తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టింది. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు, సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం సదరు కానిస్టేబుల్ కె. అనిల్‌ను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నుంచి ప్రాథమిక విచారణ నివేదిక అందిన వెంటనే అంతర్గత శాఖాపరమైన విచారణ (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ) చేపట్టి, నిబంధనల ప్రకారం కఠిన శిక్ష విధిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు కానిస్టేబుల్ అనిల్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 589/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 79లతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితుడు తన వ్యక్తిగత మొబైల్ ఫోన్ నుంచే ఈ అభ్యంతరకర పోస్టులను పెట్టినట్లు నిర్ధారణ కావడంతో, ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పరీక్షల నిమిత్తం పంపించారు. మహిళలపై ఎలాంటి అసభ్య ప్రవర్తన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట నిబంధనల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతాయని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

# మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య.. అర్ధరాత్రి మరిది ఘాతుకం!



**మంచిర్యాల జిల్లా। దండేపల్లి**
మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42) అనే మహిళను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసినట్లు సమాచారం.గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. మంత్రాల నెపంతోనే లక్ష్మిపై దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి? మంత్రాలపై ఉన్న అనుమానమే దాడికి కారణమా? లేక కుటుంబ కలహాలకు మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో నెల్కి వెంకటాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

# గణేష్ నిమజ్జనం సజావుగా సాగాలి

●అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి: సీపీ వి.సి. సజ్జనర్

●విద్యుత్ వైర్లు, రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి.. 24/7 వైద్య సేవలు







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్, ఖూా సూచించారు.ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై సీపీ సజ్జనర్ అధ్యక్షతన బుధవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పోలీస్ అధికారులు, కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఆర్టీసీ, ఫైర్ సర్వీసెస్, విద్యుత్, ఆరోగ్యం, వాటర్ వర్క్స్, ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ, మెట్రో, ఎంఎంటీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.సీపీ సజ్జనర్ మాట్లాడుతూ, గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గణేష్ ఊరేగింపు మార్గాల్లో అడ్డంగా వేలాడుతున్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించి, వాహనాలు సురక్షితంగా వెళ్లేలా తగిన ఎత్తులో క్లియరెన్స్ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. రామాంతపూర్ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గణేష్ మండపాలకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో పాటు ఎర్తింగ్ పూర్తి చేసి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని, వైర్ల తొలగింపు లేదా విద్యుత్ సరఫరా నిలిపివేతకు ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.నిమజ్జన మార్గాల్లో పనులు వేగవంతంసెప్టెంబర్ 14/15 నాటికే ప్రధాన నిమజ్జన మార్గాలు, ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్లు, నాలాలు, స్లాబ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ వేసే పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనుల నేపథ్యంలో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. 24/7 వైద్య సేవలుఉత్సవాల సందర్భంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 26 ప్రాంతాలతో పాటు బాలాపూర్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్సులు, పారామెడికల్ సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులను కోరారు.ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టినిమజ్జనం రోజున ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తగినన్ని పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని సూచించారు. ఆర్టీసీ, రవాణా శాఖలు అవసరమైన బస్సులు, గూడ్స్ వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జనానికి వినియోగించే క్రేన్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది వివరాలను ముందుగానే పోలీస్ శాఖకు అందించాలని ఆదేశించారు.బడా గణేష్ దర్శనం ముగింపు, నిమజ్జనానికి సంబంధించిన ముఖ్య సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు టీవీ స్క్రోలింగ్‌లు, పత్రికా ప్రకటనలు విస్తృతంగా వినియోగించాలని సూచించారు.సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన నిమజ్జనం సందర్భంగా ప్రజల సౌకర్యార్థం మెట్రో రైలు సేవలను అర్ధరాత్రి 1 గంట వరకు పొడిగించేందుకు, అలాగే నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, సంజీవయ్య పార్క్, జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్ స్టేషన్ల నుంచి రాత్రంతా ఎంఎంటీఎస్ రైళ్లు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీపీ సజ్జనర్ స్పష్టం చేశారు.

# పరికిచెరువులో అక్రమ నిర్మాణాల ఆరోపణలు.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు!

●మహాదేవపురం సమీపంలో చెరువు భూముల పరిరక్షణపై అనుమానాలు

●ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

**కుత్బుల్లాపూర్: సెప్టెంబర్ 9 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ రెవెన్యూ మండల్ కార్యాలయం పరిధిలోని మహాదేవపురం సమీపంలోని పరికిచెరువు పరిధిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. చెరువు పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.చెరువులు, వాటి పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు హైడ్రాకు ఉంది. అయితే పరికిచెరువు పరిధిలో నిర్మాణ కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం ఉన్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లయితే వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.





**చెరువు భూములకు రక్షణ ఏది?**
పరికిచెరువు క్రమంగా ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిధి, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను అధికారులు స్పష్టంగా గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల నుంచి ఎన్‌ఓసీలు పొందారా? నిర్మాణాలు చెరువు పరిధిలోకి వస్తున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**అధికారుల మౌనం ఎందుకు?**
ఒకవైపు నగరంలో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెబుతున్న నేపథ్యంలో పరికిచెరువు విషయంలో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే వాటిని అడ్డుకోవడంలో సంబంధిత శాఖలు ఎందుకు విఫలమయ్యాయో ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.పరికిచెరువు ప్రాంతాన్ని రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా పరిశీలించి చెరువు హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# నారాయణపేట జిల్లా సబ్-రిజిస్ట్రార్ (గ్రేడ్-2) మరియు ఒక ప్రైవేట్ వ్యక్తి ఏసీబీ (ACB) వలలో





| 12. | Komatla Subba Rami Reddy | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, CCS & DD, Hyderabad City, in the existing vacancy. |
|---|---|---|---|
| 13. | S. Sudarshan | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, CCS & DD, Hyderabad City, in the existing vacancy. |
| 14. | N. Shankar | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, Secretariat Security, Hyderabad City, in the existing vacancy. |
| 15. | P. Vijay Kumar | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, Road Safety, West Zone, in the existing vacancy. |
| 16. | K.Bhaskar | DSP, DCRB, Functional vertical, Rajanna Sircilla. | On transfer, he is posted as DSP, TGPA, in the existing vacancy. |
| 17. | M.Venkata Narsaiah | DSP, DCRB, Functional Vertical, Adilabad | On transfer, he is posted as DSP, CID in the existing vacancy. |

2) The Unit officers concerned, are requested to relieve the above individuals immediately with instructions to report at their new places of postings and furnish their dates of relief.

3) On relief, the individuals shall report at their new places of postings and furnish CTCs accordingly.

8/9/26.

Director General of Police

To
The individual ( through Unit officers concerned).
The Director, TGPA, Hyderabad.
The DG, CID, TG, Hyderabad.
The Commissioners of Police, Hyderabad City & Malkajgiri.
The IGP, Railways &RS, TG, Hyderabad.
The Superintendents of Police, Medak, Sangareddy, Jagtial, Adilabad, Rajanna Sircilla & J.Bhupalpally.
The AIG, (L&O), O/o DGP, TG, Hyderabad.

Copy to the
Accountant General, TG, Hyderabad.
PAO, TG, Hyderabad.
PSs to DGP &DG (L&O), Chief Office, Hyderabad.
SC Section, Chief Office, Hyderabad & stock file.



PROCEEDINGS OF THE DIRECTOR GENERAL OF POLICE
TELANGANA, HYDERABAD

PRESENT: C.V. ANAND, IPS

Rc.No. 4/G2/2026-I. Dated: 08-09-2026.

Sub:- Police – Transfer and postings of Dy. Supdts. of Police (Civil) – Orders issued - Reg.

Read:- 1. G.O.Ms.No.62, Genl. Admn (SC.C) Dept., dt.7-2-2007.
2. PEB Proc.Rc.No. 4/G2/2026-I, dated: 8 -9-2026.

ORDER:-
As per the recommendations of the Police Establishment Board vide reference 2nd read above, following transfer and postings of Dy. Supdts. of Police (Civil), are hereby ordered with immediate effect:-

| Sl. No. | Name S/Sri | Present posting | New place of posting |
|---|---|---|---|
| 1. | K. Balakrishna Reddy | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, Cyber Crimes, Malkajgiri, vice Sri S. G. Shiva Shankar, DSP(Civil) transferred. |
| 2. | S.G.Shiva Shankar | ACP, Cyber Crimes, Malkajgiri | On transfer, he is directed to report in O/o the DGP, TG, Hyderabad. |
| 3. | Sk. Abdul Rahman | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, DCRB, Functional Verticals, J.Bhupalpally, in the existing vacancy. |
| 4. | A. Ravi Kumar | Dy. Supdt. of Police, waiting | He is posted DSP, DCRB, Functional Verticals, Jagtial in the existing vacancy. |
| 5. | B. NandiramNaik | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, DG Control Room, O/o DGP, TG, Hyderabad in the existing vacancy. |
| 6. | B. Somnarayan Singh | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, TGPA, in the existing vacancy. |
| 7. | J. Venkateshwar Rao | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, DCRB, Functional Verticals, Medak, in the existing vacancy. |
| 8. | B. Kishan Kumar | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, Secretariat Security, Hyderabad City, in the existing vacancy |
| 9. | L. Ramesh Kumar | Dy. Supdt. of Police, waiting | He is posted as ACP, CTC, Hyderabad City, in the existing vacancy |
| 10. | N. Srinivas Reddy | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, DCRB, Functional Verticals, Sangareddy, in the existing vacancy. |
| 11. | Kadaru Venkat Reddy | Dy. Supdt. of Police, waiting | He is posted as DSP, TGPA, in the existing vacancy. |

**జ్యోతి శ్వేత, అమీర్ హుస్సేన్ (క్రైమ్ బ్యూరో చీఫ్)**

నారాయణపేట జిల్లా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సబ్-రిజిస్ట్రార్ (గ్రేడ్-2) శ్రీ లాగిశెట్టి వెంకట్ స్వామి (ఆూ-1) మరియు ప్రైవేట్ వ్యక్తి ('ఇంటి భోజనం మెస్' యజమాని) శ్రీ కమ్మరి నాగేశ్ (ఆూ-2) లపై నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించి కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదుదారునికి చెందిన ఇంటి రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నం. 4723/2026) ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారికంగా అనుకూలంగా వ్యవహరించే నిమిత్తం, ఆూ-1 రూ. 90,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా 21.07.2026న ఆూ-2 ద్వారా రూ. 50,000 స్వీకరించారు, ఆ తర్వాత మిగిలిన రూ. 40,000 కోసం డిమాండ్ చేశారు. తద్వారా, ఆూ-1 తన అధికారిక విధులను నిర్వహించడంలో అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా వ్యవహరించి, తనకు తాను అక్రమ లబ్ధిని పొందడానికి ప్రయత్నించారు. కావున, ఆూ-1 మరియు ఆూ-2 లను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని కేసుల గౌరవనీయులైన మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి. సెల్ ఫోన్ నంబర్ - 1064 (టోల్-ఫ్రీ నంబర్); ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ఏసీబీ (ఆూజదీ) టోల్-ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (, మరియు ట్విట్టర్ ద్వారా కూడా తెలంగాణ ఏసీబీని సంప్రదించవచ్చు. తెలంగాణ ఏసీబీని సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ఏసీబీ క్యూఆర్ (ఆ=) కోడ్ ప్రదర్శించబడింది. బాధితుడు/ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. పి. ఆర్. ఓ. (గ్రా. =.ా. )అవినీతి నిరోధక శాఖ (ఆూజదీ), తెలంగాణ, హైదరాబాద్.

# నేరడుగొమ్ము మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్



**దేవరకొండ 09సెప్టెంబర్ ) :**
నేరడుగొమ్ము మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో మండల పరిధిలోని ఉన్న అన్ని స్కూళ్ల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎంపిక ప్రక్రియలో క్రీడా ప్రతిభ, శారీరక సామర్థ్యం,ఇతర నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయి ఆటలలో పాల్గొంటారు. ఈ సెలక్షన్స్ ని ప్రారంభించడానికి మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మాచారి,ఎస్సై నాగేంద్రబాబు,ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎన్.గణేష్,పీడీలు వెంకటేశ్వర్లు,కేతావత్ శ్రీను, చంద్రకళ,వెంకటేష్,ఉపాధ్యాయులు ఆంజనేయులు, యుగేందర్ రెడ్డి,శంకర్ గౌడ్, సుధాకారాచారి,పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి,నరేందర్ రెడ్డి,సంజీవ్,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై మధిర టౌన్ స్టేషన్లో బిఆర్ఎస్ ఫిర్యాదు

**మధిర సెప్టెంబర్ 9**




తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర రావు మరణాన్ని బహిరంగంగా కోరుతూ హాని చేయటానికి ప్రేరేపించేలా వ్యాఖ్యల చేసిన ఎమ్మెల్యే శంకర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మధిర బిఆర్ఎస్ నాయకులు పల్లపోతు వెంకటేశ్వరావు, చిత్తారి నాగేశ్వరావు, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, చావా వేణు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, ప్యారి, చీధిరాల రాంబాబు, వేల్పుల శివ, వీర రాఘవరెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, తదితరులు మధిర టౌన్ సిఐ రమేష్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి బహిరంగంగా చావుని కోరిన ఎమ్మెల్యే శంకర్ పై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశానికి శాఖలు వారీగా అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు పురోగతిపై చక్కని ప్రజెంటేషన్ రూపొందించాలి.

**- వివిధ శాఖలు అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశం ...**

**ఏలూరు, సెప్టెంబరు 09:**
జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశం మందిరంలో బుధవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీలు జరిగే సమావేశానికి శాఖలు వారీగా పూర్తిస్థాయి నివేదికలు సాయంత్రానికి అందించాలని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ పాల్గొన్నారు. వివిధ శాఖలు పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు, పురోగతిలో ఉన్న పనులు తదితర అంశాలుపై శాఖల వారీగా జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల ( రేపటి నుండి) 10,11 తేదీల్లో అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్నదని అన్నారు. ఇప్పటివరకు సాధించిన ప్రగతి, రానున్న రోజుల్లో చేపట్టబోయే లక్ష్యాలు, మనకు కావసిన నిధులు శాఖలు వారీగా చక్కని ప్రజెంటేషన్, ఈ రోజు సాయంత్రానికి అందించాలని ఆదేశించామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు రోజులు సమావేశానికి ఏలూరు జిల్లా తరపున చక్కని ప్రజెంటేషన్ ఇవ్వడానికి దోహదపడుతుందని అన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన తాజా వివరాలు, పురోగతి నివేదికలు, సాధించిన లక్ష్యాలు, పెండింగు అంశాలు తదితర సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు వెరిఫై చేసుకుని అందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు అమలులో ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు తమ శాఖలకు



సంబంధించిన అంశాలుపై పూర్తి అవగాహనతో, వాస్తవ గణాంకాలతో నివేదికలు సిద్ధం చెయ్యాలి అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాకు సంబంధించిన అంశాలను సమర్ధవంతంగా వివరించేలా అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసి, మంచి ప్రజెంటేషన్ అందించాలని అన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు తీరుపై ఖచ్చితమైన గణాంకాలతో కూడిన నివేదికలను పవర్ పాయింటు ప్రజెంటేషన్ (ఞూ) రూపంలో సిద్ధం చెయ్యాలని అన్నారు. ?ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు పేదలు సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక వసతులు కల్పన వంటి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు క్షేత్రస్థాయి పురోగతిని విజయగాథగా పొందుపరచాలని అన్నారు. ?లక్ష్యాలు సాధనలో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, నిధులు వినియోగం, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాకు వివరాలను పక్కాగా పొందుపరచాలని అన్నారు. శాఖలు మధ్య సమన్వయ లోపం లేకుండా, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా పూర్తిసమాచారాన్ని మరియొక సారి సరిచూసుకుని ప్రజెంటేషన్ అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, వివిధ శాఖలు పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజి నారాయణరావు ఆశయాలను కొనసాగించాలి

**--- ఐక్య విద్యార్థి సంఘాలు**



**మంచిర్యాల సెప్టెంబర్ 09**
ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని...మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహం లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రజా కవి కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, అన్యాయాలను ఎత్తిచూపారని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల్లో చైతన్యం కలిగించిన ఆయన సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువత సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని ప్రతి సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం తో పాటు ప్రజా చైతన్య దినోత్సవంగా నిర్వహించాలని, ఆయన సాహిత్యాన్ని విద్యార్థులకు మరింత చేరువ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పూరెళ్ల నీతిష్,బచ్చలి అభిరామ్,గార కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పెంచిన ధరలను తగ్గించాలి.

**- నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలి.**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా.ప్రభాకర్**

**సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు.**

భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఏలూరు అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించి తహసిల్దార్ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ ఎన్నికల సమయంలో ఆకాశంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను నేలకు దించి సామాన్యునికి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చి 12 ఏళ్లు గడిచినప్పటికీ ధరలను తగ్గించకపోగా రకరకాల కారణాలతో విపరీతంగా పెంచుతున్నారని ఆరోపించారు. నిత్యావసరాలతో పాటు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై ఆర్థికంగా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీ చాలని వేతనాలతో అస్తవ్యస్త ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలకు నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు మరింత ఇబ్బందులను కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను




తగ్గించాలని, 16 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా ప్రజలకు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో అధిక ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 12 ఏళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోడీ దేశ ప్రజలపై అధిక ధరల భారాన్ని వేస్తూ ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధిక ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ధరలను తగ్గించకపోగా రకరకాల కారణాలతో మరింతగా పెంచుతున్నారని విమర్శించారు. పెట్రోలు, డీజిల్,గ్యాస్,నిత్యావసర వస్తువుల ధరలతో పాటు ఔషధాల ధరలను సైతం విపరీతంగా పెంచుకునేందుకు ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇవ్వడం ప్రజా వ్యతిరేక చర్యాని ఆరోపించారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరల బారాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటియుసి ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు సరైన ఉపాధి కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. అధిక ధరలు వలన ప్రజలు ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ,జి.స్వాతి, బళ్ల కనకదుర్గారావు, ఉప్పులూరి లక్ష్మి, భవాని, రేఖ, ఎం.సత్యవతి, బాలిన ప్రసాద్,జిజ్జి వరపు సురేంద్ర, అమర్, కె.సురేష్, ఎస్.సోమేశ్వరరావు, వై.శ్రీనివాసు, ఎం.మహేష్, జి.ఈశ్వరరావు,సాయి,జి. అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

# అడసర్ల పాడులో కొత్త రేషన్ కార్డులు పంపిణీ

**ఖమ్మం సెప్టెంబర్ 8**



వేంసూర్ మండల పరిధిలోని అడసర్లపాడు గ్రామంలో బుధవారం జి పి ఓ అనూష ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కాస్ర చంద్రశేఖర్ రెడ్డి సర్పంచ్ కాటేజమలారావు చేతులు మీదుగా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అట్లూరి సత్యనారాయణరెడ్డి గ్రామ పంచాయతీ సెక్రటరీ ఉపేంద్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాజీ మార్గమే రాజమార్గం

●జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

●మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక వివాదాలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.వివాదాలను కక్షలుగా మార్చుకుని ఇరువర్గాలు సమయం, ధనం కోల్పోవద్దని ఎస్పీ సూచించారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని గుర్తించి లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలకు అవగాహన, కౌన్సెలింగ్ కల్పిస్తూ పరిష్కారానికి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కృషి చేస్తారని తెలిపారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# కవితపై అనుచిత కామెంట్స్

- కానిస్టేబుల్‌పై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు



**హైదరాబాద్ 9 సెప్టెంబర్**

మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై, ప్రత్యేకించి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.మాజీ ఎంపీ, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరమైన, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఓ పోలీసు కానిస్టేబుల్‌పై పోలీస్ శాఖ తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టింది. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు, సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం సదరు కానిస్టేబుల్ కె. అనిల్‌ను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నుంచి ప్రాథమిక విచారణ నివేదిక అందిన వెంటనే అంతర్గత శాఖాపరమైన విచారణ (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ) చేపట్టి, నిబంధనల ప్రకారం కఠిన శిక్ష విధిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు కానిస్టేబుల్ అనిల్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 589/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 75, 79లతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితుడు తన వ్యక్తిగత మొబైల్ ఫోన్ నుంచే ఈ అభ్యంతరకర పోస్టులను పెట్టినట్లు నిర్ధారణ కావడంతో, ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పరీక్షల నిమిత్తం పంపించారు. మహిళలపై ఎలాంటి అసభ్య ప్రవర్తన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట నిబంధనల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతాయని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

# మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య.. అర్ధరాత్రి మరిది ఘాతుకం!



**మంచిర్యాల జిల్లా। దండేపల్లి**

మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42) అనే మహిళను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసినట్లు సమాచారం.గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. మంత్రాల నెపంతోనే లక్ష్మిపై దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి? మంత్రాలపై ఉన్న అనుమానమే దాడికి కారణమా? లేక కుటుంబ కలహాలకు మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో నెల్కి వెంకటాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

# రిలయన్స్ కోసం రైతుల జీవితాలను బొగ్గు పాలు చేస్తారా?

- యూసీజీ బొగ్గు వెలికితీతపై వాస్తవాలు ప్రజలకు చెప్పండి..
- బొగ్గు గని కోసం మా భూములు ఇవ్వం..
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశం తీర్మానం..




**చింతలపూడి (అంకులయ్య కొత్తగూడెం) సెప్టెంబర్ 9:** రిలయన్స్ లాభాల కోసం రైతులు, ప్రజల జీవితాలను బొగ్గు పాలు చేస్తారా అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ ప్రశ్నించారు. రాఘవాపురం శివారు అంకులయ్య కొత్తగూడెంలో బొగ్గు గని ప్రాంత రైతుల సమావేశం నిర్వహించారు. రిలయన్స్ కు మా భూములు ఇవ్వం అంటూ రైతులు ఆందోళన చేపట్టారు. మా భూమి మా హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రిలయన్స్ బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తికి ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల ఎకరాలు భూసేకరణ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని రైతులతో చర్చించకుండా, రైతుల ఆమోదం లేకుండా భూములు బలవంతంగా లాక్కుంటారా అని ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయలు రిలయన్స్ కంపెనీ పెట్టుబడులు పడుతుందని ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ప్రతిపాదిత బొగ్గు గ్యాస్ ఉత్పత్తి వలన కేవలం 5 వేల మందికి మాత్రమే ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వమే ప్రకటించిందని చెప్పారు. ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో, మొక్కజొన్న, వరి తదితర ఉద్యాన, వ్యాపార,ఆహార పంటల వలన ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని, ఈ అభివృద్ధి,ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తి వలన వచ్చే పర్యావరణ ముప్పు గురించి మాట్లాడకుండా గోప్యంగా ఉంచుతున్నారని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రతిపాదిత బొగ్గు గని ప్రాజెక్టు సమగ్ర రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి. పాండు రంగారావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్.వి.ఎస్.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సత్యనారాయణ రైతులు చీకటి శ్రీనివాసరావు, శెట్టిపల్లి ప్రసాద్, మామిళ్ళపల్లి అప్పారావు, బాలా నరసింహారావు, చీకటి వెంకట సత్యనారాయణ, చీకటి రజని, మట్టా దమయంతి, మోరంపూడి శ్రీనివాసరావు, చీకటి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి . తడికలపూడి ఎస్సై వల్లి పద్మ



**కామవరపుకోట, సెప్టెంబర్ 9,**

చట్టాలపై విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తడికలపూడి ఎస్సై వల్లి పద్మ సూచించారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ఇంటి పరిసరాలలోని పెద్దలకు అవగాహన కలగజేసే బాధ్యత విద్యార్థిని, విద్యార్థులు తీసుకోవాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే మాయాజాలానికి యువత ఆకర్షితులై బంగారు భవిష్యత్తులను పాడు చేసుకోవద్దన్నారు. అలాగే చెడు అలవాట్లకు, మద్యం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనాల ప్రయాణ సమయాల్లో కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారు కూడా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. చదువు ద్వారా మంచి భవిష్యత్తును పొందవచ్చని, విద్యార్థి దశలోనే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని సబ్జెక్టులు వారిగా తర్ఫీదు పొందినట్లయితే గమ్యాన్ని చేరుకోవటం సులభతరం అవుతుందన్నారు. మహిళల భద్రత కోసం అనేక రకాల చట్టాలు అందుబాటులో ఉన్నాయని చట్టాలను వినియోగిం చుకోవాలన్నారు. 1930 సైబర్ నేరాల మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదు చేయడానికి, 112 ఏదైనా అత్యవసర పరిస్థితిలో పోలీసుల సహాయం కోరడానికి, 1098 బాలల రక్షణ మరియు సహాయం కొరకు, 1072 మాదక ద్రవ్యాల నివారణ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.ఈ కార్యక్రవ ంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...



**ఏలూరు, సెప్టెంబరు 09:** జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశ మందిరంలో బుధవారం జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి డిఆర్వో, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఐసిడిఎస్ పిడి పి.శారద, జిల్లా గృహనిర్మాణ శాఖ పిడి.జి.సత్యనారాయణ, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భాను ప్రతాప్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జి.వి.కె.మల్లిఖార్జునరావు, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఆర్డిఏ పిడి టి.వి.విజయలక్ష్మి, నోడల్ అధికారి ఇ.తులసి, సిడిపివో ఏ.పద్మావతి, పాల్గొన్నారు.

## ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు ఆత్మీయ సత్కారం.. నూతన వస్త్రాల బహుకరణ

**చింతలపూడి, సెప్టెంబర్ 9,**

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సేవలు అందించే ఫ్రంట్ లైన్ వారియర్స్ ను ప్రతి ఒక్కరు కూడా గుర్తించి సత్కరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పేర్కొన్నారు.

చింతలపూడి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి మధుబాబు ఆధ్వర్యంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ కు ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించారు.

చింతలపూడి మండలం, పట్టణ పరిధిలోని యూపీహెచ్సీ, పీహెచ్సీలలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న సుమారు 150 మంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తిస్తూ వారికి నూతన వస్త్రాలను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా బహుకరించారు.

గౌరవ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండి సేవలందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా శాసనసభ్యులు కొనియాడారుఈ కార్యక్రమంలో చింతలపూడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు చీదరాల మధుబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి అప్పారావు, పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షులు శ్రీమతి కొత్తపల్లి విజయ కుమారి , ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి,



మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ గుత్తా సత్యసాయి వరప్రసాద్ (పెదబాబు) , కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు వైభవ్

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు . టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా . ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా



ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్ భారత్-ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

# బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం, శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన లోయర్ పరేల్ నివాసం నుంచి శిక్షణ కోసం ప్రతిరోజూ ప్రయాణించడం సమస్యగా మారడంతో హార్దిక్ ముంబై నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కేంద్ర కాంట్రాక్ట్ క్రికెటర్‌గా, గాయాల నిర్వహణ నుంచి నైపుణ్య శిక్షణ వరకు జూజులోని ప్రతి సదుపాయం అతనికి అందుబాటులో ఉంది. 'అందుకే, అతను ఐపీఎల్, రాష్ట్ర లేదా జాతీయ విధుల్లో లేనప్పుడు సీఓఈని తన శాశ్వత స్థావరంగా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.' అని ఆ వర్గాలు తెలిపాయి. సీఓఈ నిర్దేశిత కార్యక్రమాలకు వెలుపల, పాండ్యా తన సొంత ఫిజియోథెరపిస్ట్, వ్యక్తిగత స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో కలిసి పనిచేయనున్నాడు. వీరు అతని శిక్షణా దినచర్యలను పర్యవేక్షిస్తారు. 'అతను దేశం తరఫున వైట్ బాల్ క్రికెట్ ఆడుతున్నంత కాలం తన స్థావరాన్ని బెంగళూరుకు మార్చుకున్నట్లే. అతను కనీసం మరో ఐదు, ఆరేళ్లపాటు ఆడాలని భావిస్తున్నాడు. సీఓఈ నియమించిన నెట్ బౌలర్లకు వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం వంటి నైపుణ్య శిక్షణ చేసినప్పుడు కూడా, హార్దిక్ వారికి తన సొంత జేబు నుంచే డబ్బు చెల్లిస్తాడు.' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్



దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు. 133 బంతుల్లో 56 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన తిలక్, శ్రేయాస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కౌనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉంది జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు.ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు



పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.



# యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం

- కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్
- అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్ చేతిలో ఓటమి



యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. డిఫెండింగ్ ఛాంపియన్ స్పానిష్ టెన్నిస్ స్టార్ కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్ తగిలింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన అతడిని బెన్ షెల్టన్ (అమెరికా) ఓడించాడు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్కరాస్‌పై బెన్ షెల్టన్ 6-7, 6-1, 6-3, 1-6, 7-6 (10-7) తేడాతో నెగ్గాడు. దీంతో ట్రోఫీని నిలబెట్టుకోవాలని భావించిన అల్కరాస్ ఊహించని ఈ ఓటమితో ఇంటిబాట పట్టాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ యాశ్ స్టేడియంలో జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్‌తో అల్కరాస్ తలపడ్డాడు. నాలుగు గంటలపాటు ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. గాయం తర్వాత నేరుగా ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన అస్కరాస్ తొలి రౌండ్‌లో అతి కష్టంమీద నెగ్గాడు. ఈ సెట్‌ను టై బ్రేక్‌లో గెలుచుకున్నాడు. అయితే తర్వాత రెండు సెట్లలో బెన్ షెల్టన్ జోరు ప్రదర్శించాడు. వరుసగా రెండు, మూడు సెట్లను 6-1, 6-3 తేడాతో గెలుచుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. పట్టు వదలని అల్కరాస్ నాలుగో సెట్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ 6-1తో సెట్‌ను గెలుచుకున్నాడు. ఇక నిర్ణయాత్మకమైన ఐదో సెట్ తీవ్ర ఉత్కంఠతకు దారి తీసింది. పోటీ హోరాహోరీగా సాగింది. ఈ ఇద్దరు 6- 6తో సమంగా నిలిచారు. దీంతో గేమ్ టై- బ్రేక్‌కు వెళ్లింది. అయితే టై- బ్రేక్‌లో షెల్టన్ 10-7తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా, అల్కరాజ్‌పై షెల్టన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. 23 ఏళ్ల అల్కరాస్ తమ కెరీర్‌లో ఎనిమిదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే ఆశతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టాడు. కానీ, ఈ ఓటమితో ఆ కల చెదిరిపోయింది. కాగా, అల్కరాస్ ఇప్పటిదాకా రెండుసార్లు (2022, 2025) ఖూ ఓపెన్ టైటిల్ దక్కించుకున్నాడు. దీంతోపాటు ఒకసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ (2026), రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), రెండుసార్లు వింబుల్డన్ (2023, 2024) గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. మరోవైపు ఇంకో క్వార్టర్ ఫైనల్‌లో టియాఫో - మికెల్సన్ తలపడ్డారు. నాలుగున్నర గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మికెల్సన్‌పై 5-7, 3-6, 7-5, 6-3, 7-6 (10-6) తేడాతో టియాఫో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లాడు.ఇక సెమీఫైనల్‌లో ఫ్రాన్సెస్ టియాఫోతో షెల్టన్ తలపడనున్నాడు. 23 ఏళ్ల షెల్టన్ తన మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతను ఇప్పటివరకు మేజర్ గ్లాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గలేదు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2023 ఖూ ఓపెన్ సెమీఫైనల్స్ వరకు వెళ్లడం అతడికి అత్యుత్తమ ప్రదర్శనలు.ఇదే టోర్నమెంట్‌లో రీసెంట్‌గా సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్‌కు తొలి రౌండ్‌లోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అతడిని మారియానో నావోన్ (అర్జెంటీనా) 7-6, 5-7, 6-4, 2-6, 6-1 తేడాతో ఓడించి సంచలనం సృష్టించాడు.




# ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా 'ఎపిక్'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. 'ఎపిక్' చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, 'ఎపిక్' తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, "ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు. దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. "నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు" అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు.

హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, "ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన 'కడలి' పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. 'ఎపిక్' సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# "ఒక్క మెతుకు పొలిమేర దాటదు"..

## 'రణబాలి'గా గర్జించిన విజయ్ దేవరకొండ..



రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి. 1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో 'రణబాలి' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# నాల్గవ హీరోను పరిచయం చేయనున్న శ్రీలీల..!



శ్రీలీల గత ఏడాది మూడు సినిమాలతో వచ్చింది. అందులో జూనియర్ కాస్త పర్వాలేదు అనిపించినా మిగిలిన సినిమాలు ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చాయి. దాంతో శ్రీలీల పని అయిపోయిందని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆరంభంలో పరాశక్తితోనూ ఫ్లాప్‌ను చవిచూసిన శ్రీలీలకి ఉస్తాద్ భగత్ సింగ్‌తో కాస్త ఊరట దక్కిందని చెప్పాలి. ప్రస్తుతం టాలీవుడ్‌లో శ్రీలీల చేస్తున్న సినిమాలు ఏంటి అంటే ఠక్కున చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆమె ఒకటి రెండు సినిమాలకు పరిశీలిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఆమె సినిమాను కన్ఫర్మ్ చేయలేదు. మరో వైపు బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో హీరోగా కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఈ సమయంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు తాజాగా ఆమెతో చర్చలు జరిపారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బాలకృష్ణ సూచన మేరకు మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మోక్షజ్ఞ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయిన విషయం తెల్సిందే. దాంతో హీరోయిన్ ను సైతం అదే స్థాయిలో బాలీవుడ్ నుంచి దించుతారని అంతా భావించారు. కానీ బాలకృష్ణ ఈ సినిమా కోసం శ్రీలీల అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో దర్శకుడు వశిష్ట లుక్ టెస్ట్‌కి రెడీ అయ్యాడని తెలుస్తోంది. మోక్షజ్ఞ, శ్రీలీలపై లుక్ టెస్ట్ చేయడంతో పాటు, కొన్ని సీన్స్ సైతం షూట్ చేసి పరిశీలించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. మోక్షజ్ఞ మొదటి సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తే అరుదైన రికార్డ్ ఆమె సొంతం అవుతుంది. ఇప్పటి వరకు ముగ్గురు హీరోలను శ్రీలీల ఇండస్ట్రీకి పరిచయం చేసింది. కన్నడ హీరో విరాట్ మొదటి సినిమా 'కిస్'. ఆ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల నటించింది. కిస్ హీరో విరాట్ కి, శ్రీలీలకు మొదటి సినిమా కావడం విశేషం. ఆ తర్వాత రోషన్ మేకా హీరోగా పరిచయం అయిన 'పెళ్లి సందడి' సినిమాలోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో శ్రీలీలకు అదే మొదటి సినిమా. రోషన్ మేకా మొదటి సినిమాకు శ్రీలీల సరైన జోడీ అనే అభిప్రాయంతో రాఘవేంద్ర రావు ఆమెను ఏరికోరి ఎంపిక చేశాడని అంటారు. ఆ తర్వాత కన్నడం నుంచి వచ్చిన కిరీటి రెడ్డి మొదటి సినిమా 'జూనియర్' లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఈ ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోగా నటించడం జరిగింది.

# మహేంద్రగిరి వారాహిని మురారితో పోల్చొద్దు: సుమంత్

డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన మహేంద్రగిరి వారాహి మూవీపై హీరో సుమంత్ ఫుల్ నమ్మకంతో ఉన్నారు. సినిమా ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇస్తుందని తెలిపారు. సుమంత్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమాకు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ నిర్మించగా, సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా ప్రమోషన్స్ లో భాగంగా సుమంత్ మీడియాతో మాట్లాడారు. మహేంద్రగిరి వారాహి తన కెరీర్ లో ఇటీవల వచ్చిన పెద్ద బడ్జెట్ సినిమాల్లో ఒకటని చెప్పారు. నిర్మాతలు మూవీని భారీ స్థాయిలో నిర్మించారని తెలిపారు. తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చిందని, ప్రేక్షకుల రెస్పాన్స్ చూసి సినిమాపై నమ్మకం మరింత పెరిగిందని అన్నారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కథను సింగిల్ సిట్టింగ్ లో చెప్పారని సుమంత్ తెలిపారు.



కథ మొత్తం తనకు నచ్చిందన్న ఆయన.. ముఖ్యంగా ఇంటర్వెల్, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు ఓ రేంజ్ లో నచ్చుతాయని అంచనా వేశారు. పురాణాలపై దర్శకుడికి మంచి అవగాహన ఉందని, అందుకే కథను ఆయన అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. వీఎఫ్ఎక్స్, క్యాస్టింగ్, యాక్షన్, థియేట్రికల్ ఎక్స్పీరియన్స్.. ఇలా అన్నీ సినిమాకు కలిసొచ్చాయని చెప్పారు. సినిమాలో తాను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ప్రశ్నించే వ్యక్తి పాత్రలో కనిపిస్తానని సుమంత్ వెల్లడించారు. అయితే తన రోల్ కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే చెప్పలేనన్న ఆయన.య డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండటంతో పాటు మంచి ఫ్యామిలీ డ్రామా, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఉన్నాయని చెప్పారు. సిద్దు జొన్నలగడ్డ సినిమాలో సీరియస్ రోల్ లో కనిపిస్తారని రివీల్ చేశారు. తమ మధ్య వచ్చే ఓ సీన్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని చెప్పారు. ఆ సీన్ చూసిన వారంతా చాలా బాగా వచ్చిందని చెప్పారని, సినిమాలో సిద్దు రోల్ బాగుంటుందని అన్నారు. ఆ రోల్ కు ఓకే చెప్పినందుకు సిద్ధుకు థ్యాంక్స్ చెప్పారు. ట్రైలర్ లో 33 ఏళ్లు దాటిన తర్వాత ఓ వంశానికి చెందిన వ్యక్తులు చనిపోతున్నట్లు చూపించడంతో మురారి సినిమా గుర్తుకొస్తుందని సుమంత్ చెప్పారు. అయితే రెండు సినిమాల స్టోరీ, స్క్రీన్ ప్లే పూర్తిగా వేర్వేరుగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. మహేంద్రగిరి వారాహి స్పెషల్ స్టోరీతో రూపొందిందన్న సుమంత్.. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు మెయిన్ స్ట్రెంత్ గా నిలుస్తుందని సుమంత్ చెప్పారు. కచ్చితంగా గూస్ బంప్స్ ఎక్స్పీరియన్స్ వస్తుందని అన్నారు. సినిమాలో మూడు మెయిన్ యాక్షన్ ఎపిసోడ్స్ తోపాటు మరికొన్ని యాక్షన్ బ్లాక్స్ ఉంటాయని తెలిపారు. వారాహి టైటిల్ స్టోరీ అనుకున్న సమయంలోనే రిజిస్టర్ చేశామని చెప్పిన ఆయన, పవన్ కల్యాణ్ వారాహి యాత్రతో ఆ పేరు పాపులర్ అయిందని చెప్పుకొచ్చారు.

# 'లస్ట్ స్టోరీస్ 3' ట్రైలర్ వచ్చేసింది.. ఈసారి మరింత బోల్డ్‌గా..




ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బోల్డ్ అంథాలజీ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాల్లోని సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ అల్లుకున్న ఈ కథలు గత భాగాల కన్నా మరింత బోల్డ్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ ఆంథాలజీలో నలుగురు ప్రముఖ దర్శకులు నాలుగు విభిన్నమైన లఘు చిత్రాలను తెరకెక్కించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ వంటి దిగ్గజ దర్శకులు తమదైన శైలిలో ఒక్కో కథను రూపొందించారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ వంటి ప్రముఖ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించారు. రియల్ లైఫ్ కపుల్ నటుడు సిద్ధార్థ్, అదితి రావు హైదరీ కొన్ని రొమాంటిక్ సీన్స్‌లో నటించారు. విభిన్నమైన కథనాలతో రాబోతున్న ఈ ఆంథాలజీ సిరీస్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com